
కన్నప్ప ఆలయం వద్ద ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు


కొండపైకి భక్తకన్నప్ప ఊరేగింపు



భిక్షాల గాలి గోపురం వద్ద అలంకరణ


ముక్కంటీశుడి ధ్వజస్తంభం వద్ద పుష్పాలంకరణ

భక్తుడికే తొలి పూజ

- శ్రీకాళహస్తిలో ఆగమోక్తంగా 'భక్త కన్నప్ప' ధ్వజారోహణం
- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

శ్రీకాళహస్తి, మార్చి 3: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం భక్త కన్నప్ప ఆలయం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. భక్తుడికి కొండపై స్థానం కల్పించి.. తొలి పూజను కూడా అతడికే జరిగేలా వాయులింగేశ్వర స్వామి వరమిచ్చిన కారణంతో కన్నప్ప ఆలయ ధ్వజారోహణ ఆగమోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ముక్కంటి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. కన్నప్ప ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అభిషేక పూజలు చేశాక మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ధ్వజస్తంభానికి పూజలు చేసి, హారతులు పట్టారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని ముక్కంటి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సన్నిధి వీధిలో బోయ కులస్థుల ఏర్పాటు చేసిన విడిది మండపంలో కొలువుదీర్చారు. సంప్రదాయం ప్రకారం ఉభయదారులైన బోయలు వస్త్రం, నైవేద్యం సమర్పించాక గ్రామోత్సవం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవోలు ధనపాల్, ఇన్‌స్పెక్టర్ హరిబాబుయాదవ్, పర్యవేక్షకులు విజయసారథి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా దూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను ఆదివారం ప్రారంభించారు. శ్రీకాళహస్తి క్షేత్రం విద్యుత్, పుష్పాలంకరణలతో ఆకట్టుకుంటోంది.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 9గంటలకు వెండి అంబారి సేవ
- మధ్యాహ్నం 12 గంటల నుంచి ముక్కంటి ధ్వజారోహణం ప్రారంభం
- రాత్రి 8గంటలకు వెండి అంబారి సేవ

ఏకాంతంగా ఆర్జిత సేవలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు జరిగే ఆర్జిత సేవలన్నీ ఏకాంతంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలు పూర్తయ్యేవరకు ప్రభాతసేవ, నిత్యోత్సవం, నిత్యకల్యాణం, చండీ, రుద్రహోమాలు, శయనోత్సవ సేవలను రద్దు చేశారు. రాహు, కేతు సర్పదోష నివారణ పూజలకు మహాశివరాత్రి రోజున మాత్రమే విరామం ఇవ్వడం ఆనవాయితీ. మిగిలిన రోజుల్లో యథావిధిగా సాగనున్నాయి.


కాకర్లవారిపల్లె సమీపంలో ఏనుగుల ధ్వంసం చేసిన వరిపంట

పంట పొలాలపై ఏనుగుల స్వైరవిహారం

పాకాల, మార్చి 3: పాకాల, ఐరాల మండలాల పరిధిలో పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె, చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె సమీపంలోని పంట పొలాలపై శనివారం రాత్రి ఏనుగుల గుంపు స్వైరవిహారం చేసింది. పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె సమీపంలోని శిలగొందిమూల అటవీ ప్రాంత వద్ద మామిడితోటలు, కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె పరిసరాల్లోని వరిపొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. ఏనుగుల గుంపు సదుం మండల సరిహద్దు గుండాల కనుమ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మళ్లీ తిరిగి పాకాల మండల పరిసరాల్లో పంటలపై ఏనుగుల గుంపు దాడి చేస్తుందని రైతులు భయపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో సహకరించరనే..!

తిరుపతి జిల్లాగా ఏర్పడ్డాక నియమితులైన తొలి మహిళా ఎస్పీ.. మలికా గర్గ్. ఈమె గతనెల 12వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా 20 రోజుల్లోనే బదిలీ అయ్యారు. ఎన్నికల్లో తమకు సహకరించరని అధికార పార్టీ నేతలు నిర్ధారణకు రావడం వల్లే ఈ బదిలీ అన్న ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

- 20 రోజులకే ఎస్పీ బదిలీ వెనుక కారణమిదేనన్న ప్రచారం


మలికా గర్గ్

జిల్లాకు ఏ అధికారి వచ్చినా అధికార పార్టీ నేతలను కలిసి శాలువాలు కప్పడం.. పుష్పగుచ్ఛాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. అయితే ఎస్పీగా వచ్చిన మలికా గర్గ్ ఇటువంటివేమీ చేయలేదు. దీన్ని అధికార పార్టీలో పలువురు ముఖ్య నేతలు జీర్ణించుకోలేకపోయారని తెలిసింది. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే అవినీతి, విధి నిర్వహణలో అలసత్వం వంటి ఆరోపణలతో ఓ హెడ్ కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వారిలో ఒకరిపై చర్యలు వెనక్కు తీసుకోవాలని అధికార పార్టీ కీలక నేత ఒకరు చెప్పినా ఎస్పీ వినిపించుకోలేదని పోలీసు వర్గాల సమాచారం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై అకారణంగా రౌడీషీట్ తెరుస్తున్నారని ఆ పార్టీ నేతలు ఎస్పీని కలసి ఆందోళన వ్యక్తం చేయడంతో వారిని సమాధానపరిచి విచారణకు ఉపక్రమించారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి బైండోవర్ చేయాలని, మూడుకు మించి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై రౌడీ షీట్లు తెరవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆ క్రమంలో అధికార పార్టీకి చెందిన వారిపైనే ఎక్కువగా రౌడీషీట్లు తెరిచారని తెలుస్తోంది. ఈ పరిణామాలు అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదు.

కొండపై నుంచీ చక్రం తిప్పిన అధికారికీ చుక్కలు చూపిన వైనం

ప్రత్యేకించి గతంలో తిరుమల కొండపై నుంచీ జిల్లా అంతటా చక్రం తిప్పిన ఓ పోలీసు అధికారి ఎన్నికల నేపథ్యంలో దిగువకు బదిలీ అయ్యారు. సీఎంకు సన్నిహితుడిగా పేరుపడ్డ ఆ అధికారికి బందోబస్తు డ్యూటీలు వేసే సాహసం ఏ అధికారీ చేయలేదు. అయితే మలికా గర్గ్ అలాంటి మినహాయింపులేమీ ఇవ్వకుండా బందోబస్తు డ్యూటీ చేయించారని సమాచారం. ఆమే ఎస్పీగా కొనసాగితే తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఎపిక్ కార్డుల కేసుల దర్యాప్తులో కూడా ఇబ్బందులు తప్పవని అధికార పార్టీ నేతలు, అందులో పాలు పంచుకున్న పోలీసు అధికారులు ఆందోళనకు గురైనట్టు ఆ యా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ కారణాలకుతోడు ఎస్పీ తీరు గమనిస్తే వచ్చే ఎన్నికల్లో సహకరించే పరిస్థితి లేదని గ్రహించడంతోనే అధికార పార్టీ కీలక నేతలు సీఎంవోలో ఒత్తిడి తెచ్చి ఆమెను బదిలీ చేయించినట్టు రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. నిక్కచ్చిగా, నిజాయితీగా పనిచేస్తారని గుర్తింపు తెచ్చుకుంటున్న మహిళా పోలీసు అధికారిని కేవలం 20 రోజుల్లోనే అది కూడా ఎన్నికల సమయంలో బదిలీ చేయడం పట్ల అన్నివర్గాల నుంచీ విమర్శలు వస్తున్నాయి.

ఎన్నికల విధులపై తొలిరోజు నుంచే ఖరాఖండీ ఆదేశాలు

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే వచ్చే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడడం ప్రథమ కర్తవ్యంగా భావించాలని కింది స్థాయి అధికారులకు ఖరాఖండీగా చెబుతున్నారు. సమీక్షల్లోనూ, పోలీసు స్టేషన్లు తనిఖీ చేసిన సందర్భాల్లోనూ అధికారులకు ఇవే చెబుతూ వచ్చారు. ముఖ్యంగా గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో జిల్లాకు చెడ్డపేరు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో అలాంటివి పునరావృతం కారాదని తేల్చి చెప్పారు. ఎవరైనా గీత దాటితే నిర్మొహమాటంగా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు కూడా నివేదిస్తామని కఠినంగా మాట్లాడుతూ వచ్చారు. ఆ క్రమంలో విధుల పట్ల అలక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించే కొందరు అధికారులకు చుక్కలు చూపించినట్టు ప్రచారంలో ఉంది.

నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

- మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా బదిలీ చేసిన ప్రభుత్వం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: జిల్లాకు నూతన ఎస్పీగా విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా ఆదివారం ప్రభుత్వం బదిలీ చేసింది. 2018 బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్ పటేల్‌ను శిక్షణ అనంతరం చింతూరు గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా నియమించారు. తర్వాత రంపచోడవరం ఏఎస్పీగా, అనంతరం కర్నూలు సెబ్ ఏఎస్పీగా పనిచేశారు.



రాష్ట్రంలో 'వైసీపీ' రాచరికం నడుస్తోంది

రాష్ట్రంలో 'వైసీపీ' రాచరికం నడుస్తోంది. రాష్ట్రాన్ని వైసీపీ రాజులు పరిపాలిస్తున్నారు. తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి రాజ్యం నడుస్తోంది. 20 రోజుల్లోనే ఎస్పీని బదిలీ చేయాల్సిన అగత్యం ఏంటి? మలికా గర్గ్ ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాక తిరుపతి ఎమ్మెల్యేని కలవకపోవడం, ఆయనకు అనుకూలంగా పనిచేయకపోవడమే బదిలీకి కారణం. తిరుపతిలో ఏ స్థాయి అధికారైనా వైసీపీ ఎమ్మెల్యేల ఆశీస్సులు తీసుకుంటే తప్ప వారు ఇక్కడ పనిచేయలేరని దీన్ని బట్టి స్పష్టమౌతోంది. నిజాయితీ కల్గిన ఓ అధికారిని ఇంత తక్కువ సమయంలో ఎందుకు బదిలీ చేశారో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

చెప్పినట్టు వినకపోతే మార్చేస్తారా?

మేము చెప్పినట్టు వినాలి. మేము చెయ్యమన్నదే చేయాలి. లేదంటే మార్చేస్తాం అన్న రీతిలో అధికార పార్టీ ఆగడాలు పెరిగిపోతున్నాయి. దీనికి నిదర్శనమే ఎస్పీగా మలికా గర్గ్ బదిలీ. ఈమె ఉంటే ఎన్నికల్లో తమకు ఇబ్బందులు వస్తాయని భావించడం వల్లే బదిలీ చేయించారు. ఇటువంటివి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రతిపక్ష పార్టీలన్నీ ముక్తకంఠంతో ఎదిరించాలి.

- పి.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఆదివారం.. ఈ ఒక్కరోజే చిత్తూరు రాజకీయాల్లో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హైదరాబాదులో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు టీడీపీకి మద్దతిచ్చారు. ఆ పార్టీ కండువాతో సమావేశంలోనూ పాల్గొన్నారు. బలిజసంఘం నేతలు సమావేశమై టీడీపీ అభ్యర్థి గురజాలకు మద్దతు ప్రకటించారు. ఇలా చోటుచేసుకున్న పరిణామాలన్నీ తెలుగుదేశం పార్టీని మరింత పటిష్ట పరిచేవే.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఒక్కరోజులో..

- మారిపోయిన చిత్తూరు రాజకీయం
- పవన్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్యే ఆరణి
- టీడీపీకి సీకే మద్దతు
- తెలుగుదేశానికి సానుకూల పరిణామాలు


తన అనుచరులతో పవన్‌ను కలిసిన ఆరణి శ్రీనివాసులు

గతంలో టీడీపీ, ప్రజారాజ్యం పార్టీల్లో పనిచేసిన ఆరణి శ్రీనివాసులు.. 2009లో ప్రజారాజ్యం నుంచి..2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. పేరుకే ఈయన ఎమ్మెల్యే అయినా వ్యతిరేకవర్గం విజయానందరెడ్డికే పనులు అయ్యేవి.ఈ ఐదేళ్లు ఆయన అవమాన భారంతో నలిగిపోయారని చెప్పొచ్చు.ఎమ్మెల్యే టికెట్ తనకేనని చాలాకాలం కిందటే విజయానందరెడ్డి ప్రకటించి, తదనుగుణంగా వర్గాన్ని సమీకరించుకునే పనిలో ఉన్నారు. ఇది బలిజల సీటు అనే నమ్మకంతో ఆరణి కూడా సైలెంట్‌గా ఉండిపోయారు.తీరా ఎన్నికల సమయంలో వైసీపీ అధిష్టానం విజయానందరెడ్డికి టికెట్ ఇచ్చింది. ఆరణి శ్రీనివాసులును రాజ్యసభకు పంపిస్తానని చెప్పి మోసం చేసి, వేరేవాళ్లకు అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్యే టికెట్ రాకపోవడం,రాజ్యసభకు పంపకపోవడంతో ఆయన మరింత కుంగిపోయారు. ఈ క్రమంలో ఆయనకు బలిజ సంఘం మద్దతుగా నిలిచింది. తనకు టికెట్ ఇవ్వకున్నా.. రాజ్యసభకు పంపిస్తామని మోసంచేసినా.. పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం తరహాలో ఆరణి తన అసంతృప్తిని వెల్లగక్కలేదు. సైలెంట్‌గా చేయాల్సిందంతా చేసేశారు. ఆదివారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసిన ఆయన.. నాలుగు రోజుల్లో అధికారికంగా మంగళగిరి కార్యాలయంలో జనసేనలో చేరనున్నారు. టీడీపీ- జనసేన పొత్తు నేపథ్యంలో చిత్తూరులో గురజాల గెలుపునకు ఆరణి కృషి చేయాల్సి వస్తుంది. ఆ మేరకు సిద్ధమైనట్లు ఆయన వర్గీయులు అంటున్నారు. కాగా, రాజంపేట లోకసభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆరణి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పవన్‌ను ఈయనతో పాటు శివ, వినాయక బాలాజీ కలవగా.. తిరుపతి నేతలు హరిప్రసాద్, కిరణ్ రాయల్ వెంట ఉన్నారు. పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే కలిసిన విషయం తెలుసుకున్న వైసీపీ అధిష్టానం ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది.

టీడీపీకి మద్దతిచ్చిన సీకే



ఓసారి స్వతంత్ర, మూడుసార్లు కాంగ్రెస్ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచిన సీకే బాబు.. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు మద్దతు ప్రకటించారు. చాలాకాలం ఈయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదివారం తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ కూడా హాజరై మద్దతు కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. పార్టీ విజయానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. యువనేతలను రాజకీయాల్లో ప్రోత్సహించాలన్నారు. తన అభిమానులకు, కుటుంబ సభ్యులకు గురజాలను పరిచయం చేసి ఆయన గెలుపునకు సహకరించాలని కోరారు. టీడీపీ నేత చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీకే బాబు, ఆయన అనుచరులతో కలిసి ఆర్ఎల్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశానికి గురజాల ర్యాలీగా వెళ్లారు.

'తిరుపతి'కి పెరిగిన పోటీ

- టీడీపీ, జనసేన నుంచి ప్రచారంలో ఇతర ప్రాంతాల నేతల పేర్లు

తిరుపతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ సీటు కోసం టీడీపీ, జనసేన పార్టీల్లో పోటీ పెరుగుతోంది. ఇదివరకూ నియోజకవర్గానికి చెందిన నేతలు మాత్రమే పోటీ పడగా, ఇపుడు ఇతర ప్రాంతాల వారి పేర్లూ తెరపైకి వస్తున్నాయి. టీడీపీ నుంచి ప్రముఖ వ్యాపారవేత్త గంటా నరహరి పేరు హఠాత్తుగా ప్రచారంలోకి వచ్చింది. జనసేన టికెట్ రేసులో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు నిలిచారు. ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గంలో కలకలం సృష్టిస్తున్నాయి.

టీడీపీ నుంచి ప్రచారంలో గంటా నరహరి పేరు

తిరుపతిలో టీడీపీ టికెట్ కోసం ఇప్పటికే చాలామంది రేసులో ఉన్నారు. బలిజ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాసులు, ఎడిఫై విద్యా సంస్థ యజమాని ప్రణీత్, ఎలైట్ ఆస్పత్రి యజమాని కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు, బీసీ సామాజికవర్గం నుంచి నరసింహ యాదవ్, రెడ్డి సామాజికవర్గం నుంచీ మబ్బు దేవనారాయణరెడ్డి తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. వీరంతా తిరుపతి నియోజకవర్గానికి చెందిన వారు. బలిజ సామాజికవర్గం అధికంగా ఉన్నందున ఆ వర్గానికే టికెట్ కేటాయించాలని టీడీపీ అధిష్టానం భావిస్తోంది. అది కూడా పొత్తులో జనసేనకు సీటు కేటాయించని పక్షంలో.అయితే అధికార పార్టీ నేతల దౌర్జన్యకర సంస్కృతిని బలంగా ఎదిరించలేకపోతున్నారని కొందరిని, సామాజిక సమీకరణల్లో మరి కొందరిని,ఆర్థికంగా బలంగా లేరన్న కారణంతో మరికొందరిని...పరిగణనలోకి తీసుకునేందుకు అధిష్టానం తటపటాయిస్తోంది. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అంతుబట్టక తిరుపతిలో టీడీపీ వర్గాలు అయోమయంలో వున్నాయి. ఇలాంటి తరుణంలో హఠాత్తుగా గంటా నరహరి పేరు తెరపైకి వచ్చింది. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత సత్యప్రభ సోదరి అల్లుడైన ఇతడిని ఇదివరకూ చంద్రబాబు మదనపల్లె మినీ మహానాడులో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కొంతకాలం రాజంపేట లోక్‌సభ పరిధిలో చురుగ్గా పనిచేసిన ఆయనకు ఎంపీ సీటు కాకుండా రాజంపేట అసెంబ్లీ సీటు కేటాయిస్తారన్న ప్రచారం జరిగింది.ఇప్పుడు వున్నట్టుండి తిరుపతి టీడీ పీ టికెట్ ఆయనకే దక్కుతుందన్న ప్రచారం మొదలైంది. తిరుపతిలో బలిజ సామాజికవర్గం బలంగా వుండడం, ఆ వర్గాలకు డీకే ఆదికేశవులు కుటుంబం పట్ల గౌరవాభిమానాలున్న నేపథ్యంలో ఆ కుటుంబం తరపున నరహరి తిరుపతిలో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారని సమాచారం. ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో అధికార పార్టీ అభ్యర్థిని మించి ఖర్చు పెట్టగలిగిన శక్తి వుందని, అందువల్లే అధిష్టానం నరహరి వైపు మొగ్గు చూపుతోందన్న ప్రచా రం సాగుతోంది.

జనసేన టికెట్ రేసులో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి

అనూహ్య పరిణామాల నడుమ తిరుపతి జనసేన టికెట్ రేసులో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిలిచారు. ఈసారి చిత్తూరు టికెట్ ఆయనకు ఇవ్వకపోవడం.. రాజ్యసభ అవకాశాన్ని ఇస్తామని మొండిచేయి చూపడంతో అసంతృప్తికి లోనైన ఆయన.. ఆదివారం హైదరాబాదులో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. అక్కడ నుంచి వెనుదిరిగాక తిరుపతిలో బలిజ సామాజికవర్గానికి చెందిన పలువురు ముఖ్యులకు ఆరణి శ్రీనివాసులు ఫోన్లు చేసి తనకు తిరుపతి జనసేన టికెట్ వచ్చే అవకాశముందని, సాయం చేయాలని కోరినట్టు తెలిసింది. క్లాస్ వన్ కాంట్రాక్టరైన శ్రీనివాసులు కూడా ఆర్థికంగా బలమైన వ్యక్తి. తిరుపతిలో వైసీపీ అభ్యర్థిని ఎదుర్కొనే విషయంలో ఆర్థికంగా పోటీ పడే సామర్థ్యం ఉంది. ఈ ఫోన్ కాల్స్ సమాచారం బలిజ సామాజికవర్గంలోనూ, జనసేన పార్టీలోనూ వేగంగా ప్రచారం కావడంతో రాజకీయంగా కలకలం రేగింది. పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ నుంచీ గంటా నరహరి లేదా జనసేన నుంచీ ఆరణి శ్రీనివాసులుకు అవకాశం ఇచ్చినా ఇద్దరూ బలమైన అభ్యర్థులే అవుతారన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇవి ప్రచారాలుగానే మిగిలిపోతాయా లేదా ఇద్దరిలో ఒకరు ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం దక్కించుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారుతోంది.




మయూర వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి - సింహ వాహనంపై ఆనందవళ్ళిదేవి

మయూర వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరుడి విహారం

చంద్రగిరి, మార్చి3: తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వ రాలయంలో ఆదివారం ఉదయం మయూర వాహనంపై సుబ్రహ్మణ్య స్వామి, రాత్రి సింహ వాహనంపై ఆనందవళ్ళిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవళ్ళిదేవిని విశే షంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆనందవళ్ళిదేవి ఉత్సవమూ ర్తిని సింహ వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే సాఫ్ట్‌వేర్ కంపెనీలు తీసుకొస్తా

● యువత ఆత్మీయ సమావేశంలో పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత పులివర్తి నాని

చంద్రగిరి, మార్చి 3: టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రగిరి నియోజకవ ర్గానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలు తీసుకొస్తానని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పులివర్తి నాని అన్నారు. ఆదివారం చంద్రగిరిలో టీడీపీ మండలాధ్య క్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ యువత ఆత్మీయ సమా వేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ వైసీపీ పాల నలో రాష్ట్రం భ్రష్టుపట్టిందన్నారు. నాయకులు వాడుతున్న భాష కూడా అభ్యంతరకరమైనదన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్య క్షుడు రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, యువత సక్కూరి ధనంజయరెడ్డి, వీరంగారి మహేష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, లోకనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగాలమ్మ ఆలయంలో 11నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

చంద్రగిరి, మార్చి 3: చంద్రగిరి జాతీయ రహదారిలో వెలసిన నాగాలమ్మ ఆలయం ఆవరణలో ఈనెల 11 నుంచి 13వ తేది వరకు గణపతి, సుబ్రమ ణ్యంస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నారు. ఆది వారం ఈ మహోత్సవాల పోస్టర్లను తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవి ష్కరించారు. ఆలయ ధర్మకర్త ఒంటి శివశంకర్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమా ర్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, చంద్రగిరి ఉప సర్పంచ్ నగిరి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

పాకాల, మార్చి 3: ఇపాలగుట్ట పల్లె పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి, కొమ్మిరెడ్డిగారిపల్లె - కల్లూరు రోడ్డు నుంచి నిర్మించిన సీసీ రోడ్డును తుడా ఛైర్మన్ చెవి రెడ్డి మోహిత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. లక్ష్మీపురం గ్రామానికి వెళ్లడానికి మెయిన్ రోడ్డు నుంచి రూ.45 లక్షల తుడా నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జడ్పీ టీసీ నంగా పద్మజరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ మునీశ్వరరెడ్డి, ఏఎంసీ చైర్మెన్ లింగయ్య, స్టేట్ ఫైనాన్స్ కార్పొరే షన్ డైరెక్టర్ విక్రమ్ రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, వైస్ ఎంపీపీ రహీం నాగూర్‌బీ, వైసీపీ డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దుదాం

చంద్రగిరి, మార్చి 3: పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దుదామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హరిత పిలుపునిచ్చారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చంద్రగిరి మండలంలో 6189 మంది పిల్లలకు గాను 6133 మందికి పోలియో చుక్కలు వేశారన్నారు. చంద్రగిరి బస్టాండ్, శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ మారుతి, ఎంపీ డీవో వెంకట సూర్యసాయి, కొటాల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కుసుమ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రతిభ, ఎంపీహెచ్ఈవో ఈశ్వరయ్య పాల్గొన్నారు.

భాకరాపేట : మండలంలో 3101 మంది చిన్నారులకుగాను 3045 మందికి పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి తేజస్విని తెలి పారు. వైద్యాధికారి హేమంత్ కుమార్ రెడ్డి, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యక ర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చంద్రగిరి డివిజన్ ఎస్టీయూ కన్వీనర్‌గా వెంకటరమణ



ఎర్రావారిపాలెం, మార్చి 3: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) చంద్రగిరి డివిజన్ కన్వీనర్‌గా వెంకటరమణను నియమిస్తూ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం ఆదేశాలు జారీ చేశారు. తొగటపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయు డిగా పనిచేస్తున్న మంచినీళ్ల వెంకటరమణ నియాకమం పట్ల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు అంజిమేటి మల్లీశ్వర్, మండల అధ్యక్షుడు హనుమంత్, కార్యదర్శి వాసుదేవ హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీని నమ్మి మోసపోయా

● స్వతంత్ర అభ్యర్థిగానైనా తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా

● గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కేవీబీపురం, మార్చి 3: 'వైసీపీని నమ్మి మోసపోయా. స్వతంత్ర అభ్యర్థిగా నైనా తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా' అని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే వరప్ర సాద్‌రావు చెప్పారు. ఆదివారం కేవీబీపురం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కళత్తూరులో వైసీపీ నాయకుడు అనీల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గతంలో వైసీపీకి ఎంపీగా సేవలందించానని, ప్రస్తుతం గూడూరు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేస్తున్నానని తెలిపారు. ఇన్ని చేసినా సీఎం జగన్ తనను గుర్తించక పోవడం దారుణమన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే కలెక్టర్ పదవిని కూడా వదులుకుని రాజకీయల్లోకి వచ్చానన్నారు. ఏ పార్టీ పిలిచి టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా తిరుపతి ఎంపీ స్థానానికి పోటీచేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

అమెరికా కార్పొరేట్ ఫైనాన్స్ గ్లోబల్‌హెడ్‌గా వరదయ్యపాళెం సంతతి వ్యక్తి



మన్నే ఈశ్వరప్రసాద్

వరదయ్యపాళెం, మార్చి 3: అమెరికాలోని డిఫ్ జెన్ ఫార్మస్యూటికల్స్ వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్ ఫైనాన్స్ గ్లోబల్ హెడ్‌గా వరదయ్యపాళెం సంతతికి చెందిన మన్నే ఈశ్వరప్రసాద్ నియమితులయ్యారు. ఇంతకుముందు అమెరికాలోని వెస్టిన్ న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్‌లో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్, సలహామండలి సభ్యుడిగానూ పనిచేశారు. 1983 నవం బరు 30న జన్మించిన ఈయన వరదయ్యపాళెంకు చెందిన మాజీ సర్పంచ్ బొప్పన గురురత్నంశెట్టి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మన్నే కామాక్షయ్య మనవడు.. మన్నే వసంతకుమార్, గీతాంజలి కుమారుడు. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా అమెరికాలో నివసిస్తున్నారు. ఈశ్వరప్రసాద్ అత్యున్నతి పదవి పొంద డంపై దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, బొప్పన మోహనమురళి, బొప్పన రమేష్, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాభ్యాసమిలా..

చెన్నై తాంబరంలోని కేంద్రీయ విద్యాలయలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు, ముంబైలోని కొలివాడ కేంద్రీయ విద్యాలయలో ఎనిమిది నుంచి 12వ తరగతి వరకు, 2003లో బీకాం, 2005లో ఎంకాం ముంబైలోని సిడెన్‌హామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో పూర్తిచేశారు. 2005లో ఐసీఏఐ నుంచి చార్టర్డ్ అకౌం టెంట్‌గా, 2020లో అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ డిస్టిం క్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై

కల్యాణ వెంకన్న చిద్విలాసం




సర్వభూపాల వాహనంపై కాళీయమర్దనుడి అలంకరణలో..



కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకరణలో.. - వాహన సేవలో కోలాటాలు

చంద్రగిరి, మార్చి 3: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు కల్ప వృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారి ఉత్సవర్లను వాహన మండపానికి తీసుకొచ్చి రాజమ న్నార్ అవతారంలో అలంకరించి కల్పవృక్ష వాహనంపై అధిష్ఠించారు. అనం తరం స్వామివారిని శ్రీదేవి భూదేవి సమేత రాజమన్నార్ అలంకరణలో తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కంకణ భట్టర్ బాలాజీరంగాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవర్లకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం(పవి త్రస్నానం) నిర్వహించారు. సాయంత్రం కన్నుల పండవగా ఊంజల్ సేవ జరిగింది. రాత్రి ఉత్సవమూర్తులను వాహన మండపానికి తీసుకొచ్చి కాళీ యమర్దనుడి అలంకరణ చేసి సర్వభూపాల వాహనంపై అధిష్ఠించి, తిరు మాడ వీధుల్లో ఊరేగించారు. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ బట్టర్ శేషాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రా యులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్ స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

నేడు గరుడోత్సవం : సోమవారం రాత్రి గరుడ వాహన సేవ నిర్వహిం చనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సాయంత్రం నుంచే ఈ దారిలో వాహన రాకపోకలను శ్రీనివాసమంగాపురం నుంచి చంద్రగిరి వైపు మళ్ళించనున్నారు.

శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభయాత్ర, ఆండాళ్ మాలల ఊరేగింపు

గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు శ్రీవారి లక్ష్మీకాసులహారాన్ని తిరుపతి లోని టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభా యాత్రగా శ్రీనివాసమంగాపురానికి తీసుకురా నున్నారు.

అలాగే ఉదయం ఏడు గంటలకు గోవింద రాజస్వామి ఆలయం నుంచి ఆండాళ్ అమ్మ వారి మాలలను ఊరేగింపుగా శ్రీనివాసమంగా పురానికి తీసుకొస్తారు.

యువత భవితను నాశనం చేశారు : తెలుగు యువత



ఉరితాళ్లు చూపుతున్న తెలుగు యువత నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 3: రాష్ట్రంలో యువత భవితను సీఎం జగన్ నాశనం చేశాడని, వారికి ఉరితాడు గతి పట్టించాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. రాష్ట్రంలో ఉపాధి లేక, పరిశ్రమలు రాక యువత కూలీలుగా మారి పోయే ప రిస్థితిని వైసీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో యువతకు భవిత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని, అందుకే ప్రభుత్వ భవనాలను సైతం తాకట్టుపెడుతున్నారని అన్నారు. సచివాలయ భవనాలను బ్యాంకులో తాకట్టు పెట్టడం దీనికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా యువత మేల్కొని వైసీపీని సాగనంపాలన్నారు. టీడీపీ నాయకులు ఆర్‌పీ శ్రీనివాసులు, పెరుమాళ్ మధుబాబు, తోట వాసు దేవ్, కరణం సందీప్, శ్రీనివాస్‌యాదవ్, రఫీ, రంజిత్‌నాయుడు, శ్రీరాంబాబీ, దిలీప్‌రాయల్, గోపి, సంతోష్ రాయల్, లోకేష్ రాయల్, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో అమరలో ప్రపంచస్థాయి వైద్య సేవలు

● గల్లా రామచంద్రనాయుడు



గల్లా దంపతులను సన్మానిస్తున్న డాక్టర్లు రమాదేవి, ప్రసాద్

రేణిగుంట, మార్చి 3: భవిష్యత్తులో అమర ఆస్పత్రిలో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందిస్తా మని అమరరాజా సంస్థల అధినేత గల్లా రామ చంద్రనాయుడు వెల్లడించారు. ఆదివారం రేణి గుంట - కడప మార్గంలోని కరకంబాడి సమీ పంలో ఉన్న అమర ఆస్పత్రి మూడో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సొంత జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని భావించామన్నారు. అందుకే తాము అమరరాజ సంస్థలను ఇక్కడే నెలకొల్పామన్నారు. నేడు ప్రపంచస్థాయిలో అన్నిదేశాలకు తమ సంస్థ ఉత్పత్తులు పంపుతున్నామని చెప్పారు. అమర ఆస్పత్రి ఏర్పాటు చేసే సమయంలోనూ విశాఖపట్టణం, హైదరా బాదు నగరాల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని తమ కుటుంబంలో చర్చలు జరిగాయని వివరించారు. అయితే తిరుపతి సమీపంలో ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తే బాగుంటుందని సలహా ఇచ్చాన న్నారు. తన ఆలోచనను అనుస రిస్తూ మూడేళ్ల క్రితం ఇక్కడ అమర ఆస్పత్రిని ప్రారంభించామ న్నారు. అనతికాలంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. మరో పదేళ్లలో ప్రపంచదేశాలలో లభించే వైద్యసేవలు లభించే అవకాశం ఉందన్నారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ పరి శ్రమలతో పాటు వైద్యరంగంలోనూ తమపిల్లలు ఏర్పాటు చేసిన ఆస్పత్రి సేవలు ఖండాంతరాల్లో పేరు గడించేలా డాక్టర్లు ప్రసాద్, రమాదేవి కృషి చేయడం అభినందనీ యన్నారు. మాతృభూమికి సేవ చేసేందుకే అమెరికా నుంచి ఇక్కడికి వచ్చామని డాక్టర్ గౌరినేని ప్రసాద్ తెలియజేశారు. అనంతరం చిన్నా రుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్లలో రూ.5వేల కోట్లు సంపాదించిన చెవిరెడ్డి

● పులివర్తి నాని ఆరోపణ



జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పులివర్తి నాని, దేవర మనోహర్

తిరుపతి (రవాణా), మార్చి 3: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.5వేల కోట్లు సంపాదించాడని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని ఆరోపించారు. ఆదివారం మంగళం పరిధిలోని తిరుమ లనగర్ పంచాయతీలో తిరుపతి అర్బన్ మండల జనసేన పార్టీ కార్యా లయాన్ని ప్రారంభించారు. నాని మాట్లాడుతూ.. మంగళం ఉమ్మడి పంచాయతీలో ఎమ్మెల్యే ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాల న్నారు. ఎంపీటీసీగా ఉన్న నారాయణరెడ్డి, ఆయనకు సంబంధించిన వ్యక్తులు అందరూ ఎమ్మెల్యేకు భాగస్వామ్యం ఉన్న లేఔట్లలో రోడ్లు వేశారే కానీ ప్రజలకు అవసరం ఉన్న చోట వేయలేదన్నారు. మంగళం పంచాయతీలోని ప్రజలకు స్థానికంగానే ఇంటిస్థలాలు ఇవ్వా లని కోరారు. జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర్ మాట్లాడుతూ.. ఉమ్మడి మంగళం పంచాయతీలో నెలకొన్న సమస్యలను టీడీపీ, జన సేన అధికారంలోకి వచ్చినవెంటనే పరిష్కరిస్తామన్నారు. జనసేన నాయకులు కిషోర్‌రాయల్, నవీన్, దాము, సాయి, టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి ఈశ్వరయ్య, గోవిందరాజులు, మహేశ్వరి, పెరుగు భాస్కర్ రెడ్డి, భూషణం పాల్గొన్నారు.

సమస్యల వలయంలో దామినేడు

తిరుచానూరు, మార్చి 3: దామినేడు సమస్యల వలయంలో చిక్కు కుందని పులివర్తి నాని పేర్కొన్నారు. 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని' కార్యక్రమంలో భాగంగా ఆదివానం దామినేడులో పర్యటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్ రెడ్డి, సల్మాన్‌రాజ్, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, పాండి, సాయి రాయల్, రమేష్, రాజేంద్ర, నాగూరు, రమేష్ చౌదరి, జీవన్, కలీముల్లా, జనసైనికులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న బడి సుధాయాదవ్

తిరుపతి రూరల్, మార్చి 3: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిస రిగా చిన్నారులకు వేయించా లని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీ నర్, పుదిపట్ల సర్పంచ్ బడి సుధాయాదవ్ పేర్కొన్నారు. పుదిపట్లలో పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలి

తిరుపతి రూరల్, మార్చి 3: రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డిమండ్ చేసింది. తిరుపతి రూరల్ చిగురువాడలోని ఓ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అసోసియేష న్ రాష్ట్ర అధ్యక్షులు మూకల అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడి పినేని వెంకట్రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డిరమేష్ ప్రసంగించారు. రాష్ట్ర కోశాధికారి హైమారావు, జిల్లా అధ్యక్షులు జయప్రకాష్, రామ్మూర్తి, రమేష్, రామాంజినేయులు, నాగరాజు, గంగాధర్, రమణ, ప్రసాద్ నాయుడు, రాజయ్య, హేమకుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

నృత్యం ముగ్ధ మనోహరం



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, మార్చి 3: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో జరిగిన నృత్యప్రదర్శనలు ముగ్ధ మనోహరంగా జరిగాయి. తిరుపతికి చెందిన ఉమశ్రీ, దీపిక బృందంలోని ఊర్మిళ, రక్షిత, శశికళ, అనన్య, ఇషి ప్రియ, సాయి ప్రవస్థి, హర్షిత, పూజిత, దీప, రోషిణి, జీనీషా, భవిష్యా రెడ్డి, పూజశ్రీ భూమిజలు పలు అన్నమయ్య కీర్తనలకు చేసిన భరత నాట్యం అలరించింది. శిల్పారామం ఏవో ఖాదరవల్లీ వారిని సన్మా నించి జ్ఞాపికలు అందజేశారు. ఆదివారం కావడంతో సందర్శకులతో శిల్పారామం నిండిపోయింది.

ప్రారంభోత్సవాలు.. మళ్లీ మళ్లీ!

మంత్రి రోజా, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి మధ్య తారస్థాయి విభేదాలు



జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ప్రారంభించిన ప్రభుత్వ భవనం శిలాఫలకం - శనివారం అదే భవనాన్ని ప్రారంభించిన మంత్రి రోజా

పుత్తూరు అర్బన్/వడమాలపేట, మార్చి 3: వడమాలపేట మండ లంలో ప్రారంభోత్సవాల రగడ, ప్రొటోకాల్ అంశం రగులుతోంది. మంత్రి రోజాకు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డికి మధ్య గతం నుంచి ఉన్న విభేదాలు ఇటీవల ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాల విషయంతో తారస్థాయికి చేరుకున్నాయి. ఫిబ్రవరి 26వ తేదీన మండల పరిధి లోని అయ్యన్నగారిపల్లెలో జగనన్న పాలవెల్లువ కేంద్రం, పత్తి పుత్తూ రులో రైతు భరోసా కేంద్రం, అప్పలాయగుంటలో సచివాలయ భవ నాన్ని జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభోత్సవం చేయడంతోపాటు తన పేరుతో శిలాఫలకాలను ఆవిష్కరించి మంత్రి రోజాకు సవాల్ విసిరారు. దీంతో ఉలిక్కిపడిన మంత్రి వర్గం నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. మరుసటి రోజు మండల స్థాయి అధికారులు, పోలీస్ ఫోర్సును రంగంలోకి దింపి జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాలను తొలగించారు. ఇదిలా ఉండగానే శనివారం అదే భవనాలను మంత్రి రోజా మళ్లీ ప్రారంభించడం, శిలా ఫలకాలను ఏర్పాటు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

తాడో పేడోకు.. 'సిద్ధం': నగరి నియోజకవర్గంలో మంత్రి రోజాకు సొంత పార్టీలోనే అన్ని మండలాల నుంచి అసమ్మతి వర్గం ఉందనే విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో అస మ్మతి వర్గంలోని వడమాలపేటకు చెందిన నాయకుడు మురళీధర్ రెడ్డి మంత్రి రోజాతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత నెలలో చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశంలో మంత్రి వ్యవహారశైలిపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు. జడ్పీటీసీగా తమ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మంత్రి రోజా అన్నదమ్ములు నియోజకవర్గంలో అవినీతికి పాల్పడు తున్నారని ఆరోపణాస్త్రాలు సంధించారు. దీంతో సార్వత్రిక ఎన్నికల ముందు వడమాలపేట అధికారపార్టీలో చెలరేగిన అసమ్మతి జ్వాలలు ఎటుదారి తీస్తాయోనని వైసీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

2,48,606 మంది చిన్నారులకు చుక్కల మందు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి సిటీ, మార్చి 3: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొదటి రోజునే 2,53,282 మంది చిన్నారులకు గాను 2,48,606 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి తెలి పారు. నగర పరిధిలోని అర్బ న్ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ఆయన మున్సి పల్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. తొలిరో జునే 1824 పోలియో కేంద్రాల్లో 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 98.1 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వేసి నూరు శాతం విజయవంతంగా పూర్తి చేస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాసులు, డాక్టర్లు తేజస్విని తదిత రులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

● సెక్టోరల్ అధికారులతో కలెక్టర్

తిరుపతి (రవాణా), మార్చి 3: సెక్టోరల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై, ఈవీఎంల వాడకంపై అవగాహన కలిగి ఉండాలని కలె క్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సెక్టోరల్ అధికారులకు ఈవీఎం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ వాడకంపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదివారం పరి శీలించారు. పలు ప్రశ్నలు అడిగి, వారి సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, ట్రైనర్లు, ఎన్ని కల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో యువకుడిపై దాడి

● హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు



గాయపడిన రామ్‌లాల్ చౌపాల్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: యువకు డిపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్ఐ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొర్లగుంట మారుతీనగర్‌లోని ఓ భవనంలో మొదటి అంత స్తులో సంతోష్ కుటుంబం, రెండో అంతస్తులో రామ్‌లాల్ చౌపాల్ కుటుంబం ఉంటోంది. శుక్ర వారం రాత్రి రామ్‌లాల్ చౌపాల్ రెండో అంతస్తు లోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో మొదటి అంతస్తులోని సంతోష్ తన స్నేహితులు అఫ్రిది, జగన్‌తో కలిసి మెట్లపై మాట్లాడుకుంటున్నారు. అడ్డుగా ఉండటంతో దారి ఇవ్వాలని రామ్‌లాల్ అడిగాడు. ఈ సమయంలో సంతోష్, స్నేహి తులు దురుసుగా మాట్లాడారు. ప్రశ్నించిన రామ్‌లాల్‌పై ముగ్గురు స్నేహి తులు దాడి చేశారు. సంతోష్ ఇంట్లోకివెళ్లి కూరగాయలు కోసే చాకు తీసు కొచ్చి రామ్‌లాల్‌పై దాడి చేశాడు. రామ్‌లాల్ కుడి కంటిపై, కుడిపక్క మెడపై గాయాలు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు అతన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు స్నేహితులపై ఎస్ఐ లావణ్య హత్యా యత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మేమెంతో.. మాకంత..!

● బీసీలకు 50 శాతం ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలి

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరయాదవ్ డిమాండ్



కాగడాలను ప్రదర్శిస్తున్న బీసీ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3: రాష్ట్రంలోని అన్ని పార్టీలు బీసీ లకు 50 శాతం ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరయాదవ్ డిమాండ్ చేశారు. ఎస్వీ యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద ఆదివారం నిర్వహించిన కాగడాల ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలూ బీసీలను బానిసలుగా చూస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించి బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేకపోతే బీసీ వ్యతిరేక విధానాలు అవలంబించే పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చ రించారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూడొద్దని, ఓటు యంత్రాలుగా చేయొ ద్దని ఆయా పార్టీలకు విజ్ఞప్తి చేశారు. కొన్ని సంక్షేమ పథకాలు ఇచ్చి బీసీ వర్గాల నోరు మూయించాలని చూసే పార్టీలకు మనుగడ ఉండదని స్పష్టం చేశారు. బీసీలకు జనాభాను అనుసరించి సీట్ల కేటాయింపు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కరువు

● గిరిజన నవ సమాజ్ అధ్యక్షులు శివశంకర్‌నాయక్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు భద్రత కరువైందని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలిత్యా శివశంకర్‌నాయక్ పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గం మల్లవరం ఎస్టీ కాల నీకి చెందిన బాణావత్ సామునీని ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన ఘటన దారు ణమన్నారు. తాగునీరు అడిగిన గిరిజన మహిళను ట్రాక్టర్ తొక్కించి చంపడం అన్యాయమన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచా రించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘట నలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. లేకపోతే గిరిజన విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తిరుపతి రూరల్, మార్చి 3: తొండవాడకు చెందిన సుజాతమ్మకు సీఎం సహాయ నిధికి చెందిన రూ.70వేల చెక్కును తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆదివారం అందజేశారు. సుజాతమ్మ కూతురు మౌనిక అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న మోహిత్‌రెడ్డి ఈ సాయం అందించారు.

పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (రవాణా), మార్చి 3: ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఫార్మ్స్, క్లెయిమ్స్, డిస్పోజల్స్‌పై తిరుపతి, చంద్రగిరి ఈఆర్వోలతో మున్సిపల్ కార్పొరేషన్, రూరల్ తహసీల్దారు కార్యాలయాల్లో ఆదివారం కలెక్టర్ సమీక్షించారు. తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయంలో బీయాండ్ ఎస్‌ఎల్‌ఏలో ఉన్న క్లెయిమ్స్, అబ్జెక్షన్, పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈఆర్వోలు వెరిఫై చేసి అనుమతించిన, రిజక్టు చేసిన క్లెయిమ్స్ అభ్యంతరాలను తనిఖీ చేశారు. బీఎల్వోలు వారి పరిధిలో వలసపోయిన, మరణించిన వారి వివరాలు ఓటరు జాబితాలో ఉంటే వాటిని సుమోటోగా తీసుకుని తొలగించరాదని, పకడ్బందీ ధ్రువపత్రాలతో మాత్రమే తొలగించాలన్నారు. సంబంధిత రికార్డు పత్రాలను భద్రపరచాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్వోలు నిశాంత్‌రెడ్డి, ఆదితిసింగ్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

త్వరలో మరిన్ని మలబార్ షోరూమ్‌ల ప్రారంభం

తిరుపతి(కొర్లగుంట), మార్చి 3: ప్రముఖ ఆభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అంతర్జాతీయ విస్తరణలో భాగంగా ఈ నెలలో మరో పది నూతన షోరూమ్‌లను ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని తిరుపతి షోరూం హెడ్ రెజీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 350 షోరూంలు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, పుదుచ్చేరిలో కొత్త షోరూంలు ప్రారంభంకానున్నాయని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

34 ఆర్టీసీ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కొర్లగుంట), మార్చి 3 : ఆర్టీసీ ఆధ్వర్యంలో వివిధ డిపోలలో ఖాళీగా ఉన్న 34 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా డిపోల మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తులు లభిస్తాయని, 6వ తేదీ మధ్యాహ్నం లోపు డీపీటీవోలోని ప్రత్యేక బాక్సులో వేయాలని పేర్కొన్నారు. రేణిగుంట, బాలాయపల్లి, ఏర్పేడు, వరదయ్యపాళెం, సత్యవేడు ఒక్కొక్కటి చొప్పున, పాకాల 7, భాకరాపేట, పుత్తూరు 2చొప్పున, శ్రీకాళహస్తి, కోట 6చొప్పున, నాయుడుపేట, వెంకటగిరి 3చొప్పున ఖాళీలున్నాయని వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : మోసిన బేగం

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 3 : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోసిన బేగం అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 7న నారీ న్యాయసేవ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చి చైతన్యపరుస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల ప్రదానం



ప్రతిభా బెల్టులు, పశంసాపత్రాలు అందుకున్న తైక్వాండో క్రీడాకారులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 3: తైక్వాండో క్రీడలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆదివారం బెల్టులు ప్రదానం చేశారు. శ్రీదేవి కాంప్లెక్స్‌లోని తైక్వాండో శిక్షణ కేంద్రం శిక్షకులు గోపీనాయుడు, సురేష్ పర్యవేక్షణలో క్రీడాకారులు పోటాపోటీగా విన్యాసాలు ప్రదర్శించారు. ప్రతిభచాటిన వారికి గ్రేడింగ్ బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నిర్వాహకురాలు గీత మాట్లాడుతూ పిల్లలు మరింత శిక్షణ పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు



క్యారమ్స్ పోటీలో టీటీడీ ఉద్యోగులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 3: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ సీనియర్స్‌లో వెంకటరమణ-వాసు జట్టుపై రమేష్ - శ్రీనివాసమూర్తి జట్టు విజయం సాధించింది. జూనియర్స్‌లో బాలకృష్ణారెడ్డి-వెంకటరమణనాయక్ జట్టుపై రాజశేఖర్-ప్రతాజ్ జట్టు, సింగిల్స్‌లో వేణుగోపాల్‌పై రాజశేఖర్ గెలుపొందారు. చదరంగం మహిళా విభాగంలో బి.గిరిజాకుమారిపై అలేఖ్య విజయం సాధించారు. వాలీబాల్ పోటీల్లో వెంకటేశ్వర్లునాయుడు జట్టుపై రామకృష్ణ జట్టు విజయం సాధించింది.

ముగిసిన రేణుకాపరమేశ్వరి మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి (కల్చరల్), మార్చి 3: పట్నూలు వీధిలో వెలసిన రేణుకా పరమేశ్వరి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి నిమజ్జనంతో ముగిశాయి. ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆలయంలో పూజలు చేయించి, ఊరేగింపులో పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఆలయం వద్ద ప్రసాద వితరణ చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం ఉంటుంది. ఈ వేడుకల్లో పట్నూలు వీధి ప్రముఖులు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు దానా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 3: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంకల్ప, కృష్ణతేజ డెంటల్ కాలేజీ వైద్యులు వేర్వేరుగా రోగులకు బీపీ, షుగర్, చర్మవ్యాధులు, న్యూరాలజీ, దంత సంబంధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఇలాంటి వైద్య శిబిరాల వల్ల పేదల ఆరోగ్యం మెరుగుపడుతుందని వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి ఎం.నాగార్జున తెలిపారు. విజ్ఞాన కేంద్రం సభ్యులు డాక్టర్ జాలేశ్వర్‌రావు, వెంకటరమణ, మునిలక్ష్మి, తహసున్నీసా, హేమలత, కుప్పస్వామి, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ నాయకులు బాలకృష్ణ, ముకేష్, కిరణ్, రాజేష్, శ్రీనివాస్, నాగరాజు, సంకల్ప ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ ఆసిఫ్, డాక్టర్లు వాణిరెడ్డి మొగిలీశ్వరి, శ్రీనివాస్, చదలవాడ డెంటర్ కాలేజీ వైద్యులు డాక్టర్ శిరీష, అక్షయ వైద్యబృందం పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చెవిరెడ్డి శ్రీదేవి



తిరుపతి(లీగల్), మార్చి 3: అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది చెవిరెడ్డి శ్రీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లపాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా కూడా ఆమె ఎంపికయ్యారు. పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ప్రముఖులు అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 70,442 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 30,867 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో 5,438 మందికి పోలియో చుక్కలు



పోలియో చుక్కలు వేస్తున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల, మార్చి3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం 5,438 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు, స్థానికులు, ఉద్యోగుల ఐదేళ్ల లోపు పిల్లలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేశారు. అశ్విని ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్, జీఎన్సీ టోల్‌గేట్, సీఆర్వో, పీఏసీ 1, 2, కొత్త బస్టాండ్, హెల్త్ ఆఫీస్, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1, 2, ఏటీసీ, ఎంబీసీ 34, వరాహస్వామి విశ్రాంతి భవనం 1, కల్యాణకట్ట, మేదరమిట్ట, పాపవినాశనం, సుపథం, బాలాజీనగర్ వినాయకస్వామి ఆలయం, బాలాజీనగర్ బాల బడి, ఎస్వీ హైస్కూల్, తిరుమల శ్రీవారి ఆలయం లోపల, బయట, ఉద్యోగుల డిస్పెన్సరీలతో సహా మొత్తం 25 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు. ఉదయం శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ ఈవో ధర్మారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్లు డాక్టర్ బీ కుసుమకుమారి, డాక్టర్ ఎస్.కుసుమకుమారి, హెడ్ నర్సులు కృష్ణకుమారి, సావిత్రమ్మ, వైద్య, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..



పోలియో చుక్కలు వేస్తున్న భక్తవత్సలం

తిరుపతి(కొర్లగుంట), మార్చి 3: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డబ్ల్యూఎం భక్తవత్సలం ఆధ్వర్యంలో ఖాదీకాలనీ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ప్రజలంతా భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీసీల మహాసభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 3: మంగళగిరిలో మంగళవారం జరిగే బీసీల మహాసభను విజయవంతం చేద్దామని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగనిచ్చారన్నారు. మంగళగిరిలో జరిగే బీసీ మహాసభలో బీసీల డిక్లరేషన్ విడుదల చేస్తారని తెలిపారు. బీసీ కులాల నాయకులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆముదాల తులసీదాస్, రామయ్య, మధుసూదన్‌యాదవ్, విశ్వనాథం, సత్యవతి, అశోక్ భక్తవత్సలం, శ్రీనివాసులు, వెంకట మునిశంకర్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది. రేణిగుంట మండలం కుక్కలదొడ్డికి చెందిన కె.బాలగురప్ప (30) శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై తిరుపతికి వచ్చాడు. ఆదివారం రాత్రి తిరిగి వెళుతుండగా పూతలపట్టు-రేణిగుంట జాతీయ రహదారిపై బాలాజీ డెయిరీ వద్ద గుర్తు తెలియని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూత వాహనంపై సోమస్కందమూర్తి



భూతవాహనంలో కపిలేశ్వర స్వామి



సింహ వాహన సేవ

తిరుపతి (కల్చరల్), మార్చి 3: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కామాక్షి సమేత సోమస్కంద మూర్తి భూత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ కపిలతీర్థం నుంచి అన్నారావు కూడలి, వినాయక నగర్ క్వార్టర్స్, ఎన్‌జీవో కాలనీ, అలిపిరి బైపాస్ రోడ్డు మీదుగా ఊరేగింపు సాగింది. దారిపొడవునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు పట్టారు. అనంతరం ఆలయంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి విశేష దీపారాధన చేశారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్లు సింహ వాహనంపై వీధులలో విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటి ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. సోమవారం ఉదయం మకర వాహనం, రాత్రికి శేష (నాగ)వాహన సేవలుంటాయి.

క్రీడలతో మానసిక వికాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాధాగోవింద త్రిపాఠి

తిరుపతి(విద్య), మార్చి 3: క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసం వృద్ధి చెందుతుందని ఎస్వీ వేదవర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి పేర్కొన్నారు. వర్సిటీ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వార్షిక క్రీడలలో భాగంగా క్రికెట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేద, ఆధునిక విద్యలతోపాటు క్రీడలలోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. అకడమిక్ డీన్ గోలి సుబ్రహ్మణ్యశర్మ, రాజేష్‌కుమార్, ఉమేష్‌భట్, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి

● డీఈవో డాక్టర్ వి.శేఖర్

● కార్నివాల్ వైజ్ఞానిక ప్రదర్శన అదరహో



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న డీఈవో శేఖర్

తిరుపతి(విద్య),మార్చి 3 : విద్యార్థులు తమకు తట్టిన సరికొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే వైజ్ఞానికాలను ఆవిష్కరించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. ఎస్వీజేఎన్‌ఎం స్కూల్‌లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేసిన 18 పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కార్నివాల్-2కే24పేరిట ఆదివారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనను డీఈవో ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలో ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో అంతర్లీనమైన ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు స్మైల్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థ సీనియర్ మేనేజర్ ఎం.కిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభచాటేందుకు అన్ని వనరులు సమకూర్చుతామని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మంచి ప్రాజెక్టులు రూపొందించారని విద్యార్థులను అభినందించారు. అర్బన్ ఎంఈవో బాలాజి మాట్లాడుతూ కొత్త ఆలోచనలతోపాటు తమకు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కాగా విద్యార్థులు నీరు, విద్యుత్, ఆహారం అనే అంశాలపై దాదాపు 60ప్రాజెక్టులను రూపొందించి ఎగ్జిబిట్ చేశారు. వీరికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. టీచర్లు, స్మైల్‌సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



మేడా రఘునాథ రెడ్డి - శ్రీకాంత్‌రెడ్డి

తిరుమల, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఎంపీ రఘునాథ్‌రెడ్డి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా శ్రీవారిని దర్శించుకున్నానన్నారు.

రమాదేవి ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం కోలుకున్న బాలుడితో వైద్య బృందం

తిరుపతి సిటీ, మార్చి 3 : రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన 14 ఏళ్ల బాలుడికి అరుదైన న్యూరోసర్జరీ ఆపరేషన్ చేసి, ప్రాణాలు నిలబెట్టామని శ్రీరమాదేవి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డి తెలిపారు. సాయిరాం వీధిలోని ఆస్పత్రిలో ఆయన ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. పుత్తూరుకు చెందిన మనీష్(14) రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తల, ముఖ భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. బాలుడిని ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి నేతృత్వంలో అత్యంత క్లిష్టమైన న్యూరోసర్జరీ చేసి, మెదడులో రక్తం గడ్డ కట్టిన హిమటోమా భాగాన్ని తొలగించి ప్రాణాలు నిలబెట్టామన్నారు. ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీలో పూర్తి ఉచితంగా చేశామని చెప్పారు. బాలుడు కోలుకోవడంతో వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు 30శాతం ఐఆర్ ఇవ్వాలి : ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు నాగేశ్వరరావు, ధనంజయనాయుడు

తిరుపతి(విద్య), మార్చి 3: ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వెంటనే 30శాతం ఐఆర్ ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ(ఎస్టీయూ) నాయకులు గాజుల నాగేశ్వరరావు, కె.ధనంజయనాయుడు కోరారు. సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించి పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ బాధ్యతలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. గతంలో పీఆర్సీ అమలు చేసేవరకు ఐఆర్ ప్రకటించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ క్రమంలో 2023 జూలై నుంచి 12వ వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర తరహాలో ప్రస్తుత డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరారు. 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రభుత్వం కేవలం 6వేల పోస్టులతో డీఎస్సీని విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాగా జిల్లాలో పలు డివిజన్లకు కన్వీనర్లను ఎన్నుకున్నారు. తిరుపతికి వాసు, శ్రీకాళహస్తికి సుధాకర్ యాదవ్, పుత్తూరుకు సురేష్, గూడూరుకు రత్నయ్య, చంద్రగిరికి వెంకటరమణని నియమించినట్లు వెల్లడించారు. నాయకులు రమేష్ బాబు, జగన్నాథం, మోహన్, రామాంజనేయులు, వేణుగోపాల్, హమీద్‌బాషా, మధుసూదనరాజు, మురళీకృష్ణ, సురేష్, మహిళా కన్వీనర్ రేణుకాదేవి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల వర్తింపుపై ప్రజలను చైతన్యపరుస్తాం

● హెచ్‌యూఎస్ జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహేష్

తిరుపతి(విద్య), మార్చి 3: ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో హిందువులు, బౌద్ధ, సిక్కు మతాలకు చెందిన వారికి మాత్రమే దళిత(ఎస్సీ, ఎస్టీ) రిజర్వేషన్లను వర్తింపజేయాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పరిరక్షణ విభాగ రాయలసీమ జోన్ అధ్యక్షుడు నాగరాజన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటదాసుతో కలసి ఆయన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా పైమతాలకు సంబంధం లేనివారిని షెడ్యూల్ కులాలవారుగా పరిగణించరాదన్నారు. నిజమైన దళిత హిందువులకు రిజర్వేషన్లు అందించేందుకు దీన్ని ఉద్యమంగా క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లి చైతన్య పరిచేలా కార్యాచరణ రూపొందించామని వివరించారు. వెంకటదాసు, నాగరాజన్ మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు సర్వీసు రూల్స్‌లో హిందువులుగా, ఇతర విషయాల్లో అన్యమతస్తులుగా చలామణి అవుతూ దళిత హిందు వర్గాలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు.

టీడీపీలో చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



టీడీపీ చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మార్చి 3: పెళ్లకూరు మండలంలోని రోసనూరు, రోసనూరు రాజుపాలెం గ్రామాలకు చెందిన సుమారు 30 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగానికి పురుడుపోసింది టీడీపీ అధినేత చంద్రబాబునాయుడేనని కొనియాడారు. ఉన్నత విద్యావంతురాలైన డాక్టర్ నెలవల విజయశ్రీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, రాపూరు పరశరామ్ తదితరులు నాల్గొన్నారు.

భవిష్యత్తులో అమరలో ప్రపంచస్థాయి వైద్యసేవలు

గల్లా రామచంద్రనాయుడు



గల్లా దంపతులను సన్మానిస్తున్న డాక్టర్లు రమాదేవి, ప్రసాద్

రేణిగుంట, మార్చి 3: భవిష్యత్తులో అమర ఆస్పత్రిలో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందిస్తామని అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు వెల్లడించారు. ఆదివారం రేణిగుంట - కడప మార్గంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రి మూడో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సొంత జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని భావించామన్నారు. అందుకే తాము అమరరాజ సంస్థలను ఇక్కడే నెలకొల్పామన్నారు. నేడు ప్రపంచస్థాయిలో అన్నిదేశాలకు తమ సంస్థ ఉత్పత్తులు పంపుతున్నామని చెప్పారు. అమర ఆస్పత్రి ఏర్పాటు చేసే సమయంలోనూ విశాఖపట్టణం, హైదరాబాదు నగరాల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని తమ కుటుంబంలో చర్చలు జరిగాయని వివరించారు. అయితే తిరుపతి సమీపంలో ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తే బాగుంటుందని సలహా ఇచ్చానన్నారు. తన ఆలోచనను అనుసరిస్తూ మూడేళ్ల క్రితం ఇక్కడ అమర ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. అనతికాలంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. మరో పదేళ్లలో ప్రపంచ దేశాలలో లభించే వైద్యసేవలు లభించే అవకాశం ఉందన్నారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ పరిశ్రమలతో పాటు వైద్యరంగంలోనూ తమపిల్లలు ఏర్పాటు చేసిన ఆస్పత్రి సేవలు ఖండాంతరాల్లో పేరు గడించేలా డాక్టర్లు ప్రసాద్, రమాదేవి కృషి చేయడం అభినందనీయన్నారు. మాతృభూమికి సేవ చేసేందుకే అమెరికా నుంచి ఇక్కడికి వచ్చామని డాక్టర్ గొరిసేని ప్రసాద్ తెలియజేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో యువకుడిపై దాడి

హత్యాయత్నం కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: యువకుడిపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్‌ఐ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం... కొర్లగుంట మారుతీనగర్‌లోని ఓ భవనంలో మొదటి అంతస్తులో సంతోష్ కుటుంబం, రెండో అంతస్తులో రామ్‌లాల్ చౌపాల్ కుంటుంబం ఉంటోంది. శుక్రవారం రాత్రి రామ్‌లాల్ చౌపాల్ రెండో అంతస్తులోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో మొదటి అంతస్తులోని సంతోష్ తన స్నేహితులు అఫ్రిది, జగన్‌తో కలిసి మెట్లపై మాట్లాడుకుంటున్నారు. అడ్డుగా ఉండటంతో దారి ఇవ్వాలని రామ్‌లాల్ అడిగాడు. ఈ సమయంలో సంతోష్, స్నేహితులు దురుసుగా మాట్లాడారు. ప్రశ్నించిన రామ్‌లాల్‌పై ముగ్గురు స్నేహితులు దాడి చేశారు. సంతోష్ ఇంట్లోకివెళ్లి కూరగాయలు కోసే చాకు తీసుకొచ్చి రామ్‌లాల్‌పై దాడి చేశాడు. రామ్‌లాల్ కుడి కంటిపై, కుడిపక్క మెడపై గాయాలు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు అతన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు స్నేహితులపై ఎస్‌ఐ లావణ్య హత్యాయత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, మార్చి 3: చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి నాయుడుపేటకు చెందిన లింగారెడ్డి ప్రకాష్ రెడ్డి రూ.లక్ష విరాళం ఆదివారం అందజేశారు. నాయుడుపేటకు చెందిన మరో భక్తుడు ఎస్.సురేంద్రబాబు అమ్మవారికి 8 గ్రాముల బంగారు బుట్ట కమ్మలు విరాళంగా అందజేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇళ్ల కోసం ఎంపీని నిలదీసిన మహిళలు

వరదయ్యపాళెం, మార్చి 3: ఐదేళ్లుగా కార్యాలయాల చుట్టు తిరుగుతూనే ఉనాం. జగనన్న కాలనీ అన్నారు. కానీ ఇంత వరకు స్థలం చూపలేదు. పక్కా ఇళ్లు మంజూరు చేయలేదు. కట్టిన వాటికి బిల్లులు ఇవ్వలేదు. మాకు ఒరిగిందేమి లేదని పలువురు మహిళలు ఎంపీ గురుమూర్తిని, నాయకులను నిలదీశారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్‌ఆర్ ఆసార చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లికు చెందిన పలువురు మహిళలు తమ ఆవేదనను ఎంపీ గురుమూర్తికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు జగనన్న కాలనీల పేరిట పట్టాలు ఇచ్చారేగానీ స్థలం చూపలేదన్నారు. దీంతో కొందరు తమస్థలంలోనే పక్కా ఇళ్లు నిర్మించుకున్నా వాటికి బిల్లులు ఇవ్వలేదని వాపోయారు. మరికొందరికి ఇళ్లు మంజూరు కాలేదని పేర్కొన్నారు. వలంటీర్లకు, సచివాలయంలో మొరపెట్టుకున్నా ఫలితం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం సీఎల్‌ఎన్‌పల్లిలో పర్యటించిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థికి మళ్లీ అవే సమస్యను విన్నవించారు. కళత్తూరు ఎస్టీకాలనీలో రోడ్డు నిర్మాణానికి ఎంపీ భూమిపూజ చేశారు.



ఇంటిపట్టాల కోసం ఎంపీని అడుతున్న మహిళలు

మరదవాడలో ఆర్బీకేను ఎంపీ ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన గ్రామస్తులు కోరారు. అంతకుముందు మహిళలకు ఆసరా చెక్కును ఎంపీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, నాయకులు దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బొప్పన తిలక్, చిన్న, హరిరెడ్డి పాల్గొన్నారు.

అమెరికా కార్పొరేట్ ఫైనాన్స్ గ్లోబల్‌హెడ్‌గా

వరదయ్యపాళెం సంతతి వ్యక్తి

వరదయ్యపాళెం, మార్చి 3: అమెరికాలోని డిఫ్ జెన్ ఫార్మస్యూటికల్స్ వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్ ఫైనాన్స్ గ్లోబల్ హెడ్‌గా వరదయ్యపాళెం సంతతికి చెందిన మన్నే ఈశ్వరప్రసాద్ నియమితులయ్యారు. ఇంతకు ముందు అమెరికాలోని వెస్టిన్ న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్‌లో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్, సలహామండలి సభ్యుడిగానూ పనిచేశారు. 1983 నవంబరు 30న జన్మించిన ఈయన వరదయ్యపాళెంకు చెందిన మాజీ సర్పంచ్ బొప్పన గురురత్నంశెట్టి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మన్నే కామాక్షయ్య మనవడు.. మన్నే వసంతకుమార్, గీతాంజలి కుమారుడు. ప్రస్తుతం ఉద్యోగరీత్యా అమెరికాలో నివసిస్తున్నారు. ఈశ్వరప్రసాద్



మన్నే ఈశ్వరప్రసాద్

అత్యున్నతి పదవి పొందడంపై దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, బొప్పన మోహనమురళి, బొప్పన రమేష్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాభ్యాసమిలా..

చెన్నై తాంబరంలోని కేంద్రీయ విద్యాలయలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు, ముంబైలోని కొలివాడ కేంద్రీయ విద్యాలయలో ఎనిమిది నుంచి 12వ తరగతి వరకు, 2003లో బీకాం, 2005లో ఎంకాం ముంబైలోని సిడెన్‌హామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో పూర్తిచేశారు. 2005లో ఐసీఏఐ నుంచి చార్టర్డ్ అకౌంటెంట్‌గా, 2020లో అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు.

పోలియో చుక్కలు విజయవంతం

తొట్టంబేడు/ ఏర్పేడు/ కేవీబీపురం/ బుచ్చినాయుడుకండ్రిగ/ పిచ్చాటూరు/ సత్యవేడు/ రేణిగుంట/ శ్రీకాళహస్తి, మార్చి 3: పోలియో చుక్కల కార్యక్రమం శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు చుక్కలు వేశారు.



పోలియో చుక్కలు వేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

తొట్టంబేడు మండలంలో 2122గాను 2848 మందికి, శ్రీకాళహస్తి మండలంలోని 6677గాను 6226మందికి పోలియో చుక్కలు వేశారు. ● పాపానాయుడుపేటలో సర్పంచ్ లలిత, డాక్టర్ నాగరాజు ఆధ్వర్యం, రాజులపాళెంలో ఎంపీపీ గీత చిన్నారులకు పోలియోచుక్కలను వేశారు. ● కేవీబీపురంలో 2908 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ● బుచ్చినాయుడుకండ్రిగలో వైద్యాధికారి దివాకర్ ఆధ్వర్యంలో 3388 మంది పిల్లలకు చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధివి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు పలువురు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ● పిచ్చాటూరులో సర్పంచ్ రోసిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరిశ్చంద్రారెడ్డిలతో కలసి డాక్టర్ మునిచరిత్ర, డా.హమీద్‌లు పోలియో చుక్కలు వేశారు. ● సత్యవేడు మండలం దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలో 3933 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి గుణశేఖర్ పేర్కొన్నారు. వైద్యాధికారి సురేష్, పీహెచ్‌సీ వైద్యులు మురళీకృష్ణ చిన్నారులకు చుక్కలు వేశారు. మొత్తం 4077 మందికి గాను 3933 మందికి వేశారు. ఈ కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ షణ్ముఖం, ఏఎన్‌ఎం సహాయ మేరి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ● రేణిగుంట మండలం వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీహరి, టిబి నియంత్రాధికారిణి అరుణాసులోచనా దేవి, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ శేఖర్, జయలక్ష్మి, ఆదిశేషారెడ్డి, డాక్టర్ చత్రప్రకాష్ రెడ్డి, జూలియన్‌రాజు పాల్గొన్నారు. ● శ్రీకాళహస్తిలో పల్స్ పోలియో కేంద్రాల్లో సుమారు 70 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అందించారు. జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్ బాబు, సహాయ కమిషనర్ పార్వతి, యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు మురళి, ధనుష్, తదితరులు పాల్గొన్నారు. 6226 మందికి చుక్కలు వేశారు. ఎంపీడీవో రఫీ, వైద్యులు సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వాస్తు పూజలు



పూజల్లో పాల్గొన్న ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 3: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి వాస్తు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్త కన్నప్ప ధ్వజారోహణం జరిగింది. అనంతరం భక్తకన్నప్ప చతుర్మాడ వీధుల్లో ఊరేగారు. సోమవారం స్వామివారి ధ్వజారోహణ మహోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా ముందుగా ఆలయంలో వాస్తు పూజ చేయడం సంప్రదాయం. ఆ మేరకు ఆదివారం రాత్రి ఆలయంలోని అద్దాల మండపం వద్ద పూజలు చేశారు. ముందుగా కలశ స్థాపనతో సంకల్పం పూజలు చేశారు. వాస్తు శాంతి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు, అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, వేద పండితులు అర్ధగిరి అధికారులు పాల్గొన్నారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 3: మండలంలోని పార్లపల్లి గ్రామంలో మాతమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాతమ్మ విగ్రహానికి, శూలానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది. రేణిగుంట మండలం కుక్కలదొడ్డికి చెందిన కె.బాలగుర్రప్ప (30) శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై తిరుపతికి వచ్చాడు. ఆదివారం రాత్రి తిరిగి వెళుతుండగా పూతలపట్టు-రేణిగుంట జాతీయ రహదారిపై బాలాజీ డెయిరీ వద్ద గుర్తు తెలియని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ● స్వల్పగాయాలు

ఏర్పేడు, మార్చి 3: ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద రెండు లారీలు ఆదివారం ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తిరుపతి వైపు వెళుతున్న పోస్టల్ డిపార్ట్‌మెంట్ మినీలారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఏర్పేడు ఏఎస్‌ఐ జగన్‌మోహన్ స్థానికుల సాయంతో క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను రక్షించారు. డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. అతడిని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీని నమ్మి మోసపోయా

స్వతంత్ర అభ్యర్థిగానైనా తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా

గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



కళత్తూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కేవీబీపురం, మార్చి 3: 'వైసీపీని నమ్మి మోసపోయా. స్వతంత్ర అభ్యర్థిగానైనా తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా' అని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు చెప్పారు. ఆదివారం కేవీబీపురం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కళత్తూరులో వైసీపీ నాయకుడు అనీల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గతంలో వైసీపీకి ఎంపీగా సేవలందించానని, ప్రస్తుతం గూడూరు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేస్తున్నానని తెలిపారు. ఇన్ని చేసినా సీఎం జగన్ తనను గుర్తించకపోవడం దారుణమన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే కలెక్టర్ పదవిని కూడా వదులుకుని రాజకీయల్లోకి వచ్చానన్నారు. ఏ పార్టీ పిలిచి టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా తిరుపతి ఎంపీ స్థానానికి పోటీచేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (రవాణా), మార్చి 3: ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఫార్మ్స్ క్లెయిమ్స్, డిస్పోజల్స్‌పై తిరుపతి, చంద్రగిరి ఈఆర్వోలతో మున్సిపల్ కార్పొరేషన్, రూరల్ తహసీల్దారు కార్యాలయాల్లో ఆదివారం కలెక్టర్ సమీక్షించారు. తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయంలో బీయాండ్ ఎస్‌ఎల్‌ఏలో ఉన్న క్లెయిమ్స్, అబ్జెక్షన్, పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈఆర్వోలు వెరిఫై చేసి అనుమతించిన, రిజక్టు చేసిన క్లెయిమ్స్ అభ్యంతరాలను తనిఖీ చేశారు. బీఎల్వోలు వారి పరిధిలో వలసపోయిన, మరణించిన వారి వివరాలు ఓటరు జాబితాలో ఉంటే వాటిని సుమోటోగా తీసుకుని తొలగించరాదని, పకడ్బందీ ధ్రువపత్రాలతో మాత్రమే తొలగించాలని అన్నారు. సంబంధిత రికార్డు పత్రాలను భద్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు నిశాంత్‌రెడ్డి, ఆదితిసింగ్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

యువత భవితను నాశనం చేశారు :

తెలుగు యువత



ఉరితాళ్లు చూపుతున్న తెలుగు యువత నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 3: రాష్ట్రంలో యువత భవితను సీఎం జగన్ నాశనం చేశాడని, వారికి ఉరితాడు గతి పట్టించాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. రాష్ట్రంలో ఉపాధి లేక, పరిశ్రమలు రాక యువత కూలీలుగా మారిపోయే ప రిస్థితిని వైసీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో యువతకు భవిత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని, అందుకే ప్రభుత్వ భవనాలను సైతం తాకట్టుపెడుతున్నారని అన్నారు. సచివాలయ భవనాలను బ్యాంకులో తాకట్టు పెట్టడం దీనికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా యువత మేల్కొని వైసీపీని సాగనంపాలన్నారు. టీడీపీ నాయకులు ఆర్‌పీ శ్రీనివాసులు, పెరుమాళ్ మధుబాబు, తోట వాసుదేవ్, కరణం సందీప్, శ్రీనివాస్ యాదవ్, రఫీ, రంజిత్‌నాయుడు, శ్రీరాంబాబీ, దిలీప్‌రాయల్, గోపి, సంతోష్ రాయల్, లోకేష్ రాయల్, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ - జనసేన గెలిస్తేనే రక్షణ: భానుప్రకాష్



తలకు కిరీటం, చేతికి కత్తి ఇచ్చి భానుప్రకాష్‌ను సత్కరిస్తున్న నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 3: టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు ఈశలాపురం, రాచపాళెం, బొజ్జనెత్తం, ఎస్టీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం కార్యక్రమాన్ని జనసేనతో కలిసి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్‌రాజు, కౌన్సిలర్ డాక్టర్ సింగరాజు బసంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నియంత పాలనలో కనీసం తమ సమస్యలను కూడా ధైర్యంగా చెప్పుకోలేని స్థితికి సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేశారని ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే కేసులతో వేధించడం సైకో పాలనలో రివాజుగా మారిందని మండిపడ్డారు. ఆఖరికి రాష్ట్ర సచివాలయాన్ని కూడా దొడ్డిదారిన తాకట్టు పెట్టిన వైసీపీ ప్రభుత్వ దిగజారుడుతనాన్ని ఏమనాలని నిలదీశారు. నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ మరోవైపు సొంత ఖజానాను నింపుకున్న నీచమైన ప్రభుత్వం ఇదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పాలనకు చరమగీతం పాడాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సంక్షేమం టీడీపీ, జనసేనకు ఐకాన్‌లైతే, అవినీతి, దౌర్జన్యం, దోపిడీ వైసీపీకి ఐకాన్‌లు అని ఎద్దేవా చేశారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు ఆరు గ్యారెంటీలను ప్రకటించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి వచ్చిన భానుప్రకాష్‌కు వార్డులో అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. క్షత్రియ సంప్రదాయం ప్రకారం తలకు కిరీటం, చేతికి కత్తితో భానుప్రకాష్‌ను డాక్టర్ ప్రతాప్‌రాజు, డాక్టర్ బసంతి, సొరకాయలరాజు తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు ఏ.హరిప్రసాద్, సింగరాజు సంతోష్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎన్ ధనపాల్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మహేష్, జగదీశ్వర్‌రాజు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, మార్చి3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

పుత్తూరు వార్తలు

నిండు జీవితానికి రెండు చుక్కలు



నారాయణవనం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పోలియో చుక్కల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, మార్చి 3: రెండు పోలియో చుక్కలతో నిండు జీవితాన్ని కాపాడవచ్చని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో చిన్న పిల్లలకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రుల శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యమంలో వైద్యాధికారి దర్శిత్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వడమాలపేటలో 98శాతం..

వడమాలపేట, మార్చి 3: మండలంలో 98శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి తెలిపారు. 20 కేంద్రాలు, ఒక మొబైల్ వాహనం ద్వారా 3031 మందికి పోలియో చుక్కలు వేసినట్లు ఆయన తెలిపారు. ఓటీఆర్ కండ్రిగలో పోలియోచుక్కల కేంద్రాన్ని ఎంపీపీ విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, పద్మకుమారి పర్యవేక్షించారు.

వధూవరులను ఆశీర్వదించిన భాను

వడమాలపేట, మార్చి 3: మండలంలోని సీతారామాపురం ఎస్టీకాలనీకి చెందిన టీడీపీ నాయకుడు ఆనందయ్య కుమార్తె కృష్ణకుమారి, అల్లుడు అంజల్ కుమార్‌ను నగరి ఎమ్మెల్యే అభ్యర్థి భానుప్రకాష్ ఆశీర్వదించారు. వారికి పుష్ప గుచ్ఛం అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు ధనంజయనాయుడు, జానా వెంకటయ్య, దాముయాదవ్, దేవా, భాస్కర్‌నాయుడు, హరి, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు.. మళ్లీ మళ్లీ!

మంత్రి రోజా, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి మధ్య తారస్థాయి విభేదాలు

పుత్తూరు అర్బన్/వడమాలపేట, మార్చి 3: వడమాలపేట మండలంలో ప్రారంభోత్సవాల రగడ, ప్రొటోకాల్ అంశం రగులుతోంది. మంత్రి రోజాకు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డికి మధ్య గతం నుంచి ఉన్న విభేదాలు ఇటీవల ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాల విషయంతో తారస్థాయికి చేరుకున్నాయి. ఫిబ్రవరి 26వ తేదీన మండల పరిధిలోని అయ్యన్నగారిపల్లెలో జగనన్న పాలవెల్లువ కేంద్రం, పత్తి పుత్తూరులో రైతు భరోసా కేంద్రం, అప్పలాయగుంటలో సచివాలయ భవనాన్ని జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభోత్సవం చేయడంతో





జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ప్రారంభించిన ప్రభుత్వ భవనం శిలాఫలకం - శనివారం అదే భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పాటు తన పేరుతో శిలాఫలకాలను ఆవిష్కరించి మంత్రి రోజాకు సవాల్ విసిరారు. దీంతో ఉలిక్కిపడిన మంత్రి వర్గం నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. మరుసటి రోజు మండల స్థాయి అధికారులు, పోలీస్ ఫోర్సును రంగంలోకి దింపి జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాలను తొలగించారు. ఇదిలా ఉండగానే శనివారం అదే భవనాలను మంత్రి రోజా మళ్లీ ప్రారంభించడం, శిలాఫలకాలను ఏర్పాటు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. జడ్పీటీసీ ఒకసారి, మంత్రి ఒకసారి ప్రారంభోత్సవం చేయడంతో విస్తుపోవడం మండల ప్రజల వంతైంది. ఈ వివాదం తమ మెడకు చుట్టుకుంటోందని అధికారులు ఆవేదన చెందుతుండగా, ఎటు వైపు వెళ్లాలో తెలియక అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

తాడో పేడోకు.. 'సిద్ధం'

నగరి నియోజకవర్గంలో మంత్రి రోజాకు సొంత పార్టీలోనే అన్ని మండలాల నుంచి అసమ్మతి వర్గం ఉందనే విషయం తెలిసిందే. వడమాలపేట మండలం అధికార వైసీపీకి కంచుకోట. 2014, 2019 ఎన్నికల్లో వడమాలపేట మండలంలో వచ్చిన మెజార్టీతోనే రెండుసార్లు వైసీపీ గెలవగలిగింది. అయితే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో అసమ్మతి వర్గంలోని వడమాలపేటకు చెందిన నాయకుడు మురళీధర్‌రెడ్డి మంత్రి రోజాతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత నెలలో చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశంలో మంత్రి వ్యవహారశైలిపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు. జడ్పీటీసీగా తమ హక్కులను కాలరాస్తోందని ఆరోపణలు చేశారు. తమను రాజకీయంగా అణగదొక్కిన రోజాపై కొంతకాలం నుంచి గూడుకట్టుకుని ఉన్న ఆక్రోశాన్ని బహిర్గతం చేశారు. రానున్న ఎన్నికల్లో మంత్రికి టికెట్ కేటాయించవద్దని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తూ మీడియాతో మాట్లాడారు. అలాగే శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మంత్రి రోజా అన్నదమ్ములు నియోజకవర్గంలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణాస్త్రాలు సంధించారు. ఇంత జరిగాక రోజాకు టికెట్ ఇస్తే ఆమె ఓటమికి మాత్రం తాము బాధ్యులు కాబోమని ముందస్తు సంకేతాలిచ్చారు. దీంతో సార్వత్రిక ఎన్నికల ముందు వడమాలపేట అధికారపార్టీలో చెలరేగిన అసమ్మతి జ్వాలలు ఎటుదారి తీస్తాయోనని నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

బాబు సూపర్ సిక్స్‌తో సంక్షేమం

నారాయణవనం, మార్చి 3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్‌తో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెత్తలతడుకు గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి, వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేద, దళితులతో పాటు ప్రతి ఒక్కరికీ అన్యాయం జరిగిందన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, గిరిబాబు, లత, సుబ్రహ్మణ్యం, మోహన్, తేజ, బాలసుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయండి

శ్రీకాళహస్తి, మార్చి 3: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల కోసం నిర్వహించే ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికను పూర్తిచేయాలని ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు సూచించారు. ఆలయ పరిసరాల్లో తుది దశలో సాగుతున్న ఏర్పాటు పనులను ఆదివారం ఈవో నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రథాలు, వాహన మండపం, ధూర్జటి కళా ప్రాంగణం, భక్తుల బస కోసం ఏర్పాటు చేసే షెల్టర్లు, పార్కింగ్ ప్రదేశం, తిరుమంజన గోపురం మార్గం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నూకరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయానికి విరాళాలు



దుస్తులు వితరణ చేస్తున్న సురేష్ అండ్ రమేష్ బ్రదర్స్, దొరై నాగరాజన్

శ్రీకాళహస్తి, మార్చి 3: ముక్కంటి ఆలయానికి పలువురు దాతలు వస్తు రూపంలో విరాళాలు సమర్పించారు. నాయుడుపేటకు చెందిన సిమెంట్ వ్యాపారులు సురేష్ అండ్ రమేష్ బ్రదర్స్ ఉత్సవాల్లో సేవలందించే మోత కూలీలకు 300 పంచెలు, 300 టీ షర్టులు వితరణ చేశారు. అలాగే ఆలయ ప్రథమ చికిత్స కేంద్రంలో భక్తుల వైద్యం కోసం అవసరమయ్యే మందులను విరాళంగా ఇచ్చారు. ● చెన్నైకు చెందిన వ్యాపారి దొరై నాగరాజు ఉత్సవాల్లో స్వామి అమ్మవార్లకు అలంకరించేందుకు 13 పంచెలు, 26 చీరలు ఆలయానికి సమర్పించారు. ఈ మేరకు దాతలు ఆదివారం పరిపాలనా భవనంలో ఈవో నాగేశ్వరరావుకు అందజేశారు. దాతలను ఘనంగా సత్కరించి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

తొట్టంబేడు, మార్చి 3: టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయండని టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి కోరారు. మండలంలోని చేమూరు, చియ్యవరం గ్రామాలలో ఆమె ఆదివారం ప్రచారం చేశారు. టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మునిరాజనాయుడు, వెంకటాచలం, జడ్పీటీసీలు వెంకటసుబ్బారెడ్డి, అర్చనాదేవి, నాయకులు వేమాలయ్య, మునిరాజ, రామయ్య, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఉత్సవాలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఏర్పేడు, మార్చి 3: గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్స వాలను విజయ వంతం చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన గుడిమల్లం మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి మహాశివరాత్రి వేడుకలను భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశముందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. తిరుపతి, శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఈవో రామచంద్రారెడ్డి, నాయకులు సుబ్రహ్మణ్యంయాదవ్ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ రోహిత్

నాగలాపురం, మార్చి 3: నాగలాపురం మండలంలోని నందనం గ్రామం వద్ద ఓ కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాల య్యాయి. స్థానికుల కథనం మేరకు.. చెన్నై కొరట్టూరికి చెందిన రోహిత్(16) నిర్మల (42) తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆదివారం మార్గమధ్యంలో నందనం గ్రామం వద్ద తిరుపతి- చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న చింత చెట్టును కారు అదుపుతప్పి ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

ముక్కంటి ఆలయానికి విరాళం



ఈవోకు కూరగాయలు అందిస్తున్న ప్రసాద్, విరాళం అందజేస్తున్న శ్రీధర్

శ్రీకాళహస్తి, మార్చి 3: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముక్కంటి ఆలయానికి నంద్యాలకు చెందిన ఎల్‌ప్రసాద్ అక్కడ వ్యాపారులతో కలిసి దేవస్థాన నిత్యాన్నదానానికి 12 టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ ఈవో నాగేశ్వరరావును కలిసి ఆయన చేతుల మీదుగా అన్నదాన ఇన్‌చార్జికి అందజేశారు. అదేవిధంగా సికింద్రాబాద్‌కు చెందిన శ్రీధర్ ముక్కంటి ఆలయ నిత్యాన్నదానానికి రూ.50 వేల నగదు చెక్కు రూపంలో విరాళంగా ఈవోకు అందజేశారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం: సుధీర్‌రెడ్డి

రేణిగుంట, మార్చి 3 : టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. రేణిగుంటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మరో 48 రోజుల పాటు పార్టీవిజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 30శాతం ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. రేణిగుంటకు ప్రతి రోజూ తెలుగు గంగ నీరు సరఫరా చేస్తామన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అభిమాని రమేష్, సాగర్, షరీఫ్‌ల ఆధ్వర్యంలో ముస్లింలు, యువకులు సుమారు 200 మంది టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునస్వామినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మునిచంద్రా రెడ్డి, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, మహబూబ్‌బాషా, పుష్పనాథ్, రామస్వామి, బుజ్జినాయుడు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఏర్పేడు, మార్చి 3: చిందేపల్లి గ్రామంలో వెలసిన పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో 5 నుంచి 9వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ గంగలపూడి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ఇది పొలమే..!



ఔను..ఈ చిత్రంలో మీరు చూస్తున్నది వ్యవసాయ పొలమే. మూడు నెలల క్రితం వరకు వరి పండిన నేలే. గత డిసెంబరులో మిచౌంగ్ తుఫాను ధాటికి ఆరే చెరువు వరదతో ఆయకట్టు పొలాలను ఇలా రాళ్లు కప్పేశాయి. వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి. అధికారులు రాళ్లు తొలగించి పొలాలు బాగు చేయాలని మూడునెలలుగా కోరుతున్నారు.. అధికారులు మాత్రం చలించలేదు. - **కేవీబీపురం,**

జయహో బీసీ సభకు తరలిరండి

శ్రీకాళహస్తి, మార్చి 3: ఈ నెల 5న ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా టీడీపీ నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి పిలుపునిచ్చారు. సభకు సంబంధించి సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఉత్సవాలకు బొజ్జలకు ఆహ్వానం

శ్రీకాళహస్తి, మార్చి 3: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా శ్రీకాళహస్తి టీడీపీ నాయకుడు బొజ్జల గోపాల కృష్ణారెడ్డిని ఆలయాధికారులు ఆహ్వానించారు. ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆలయ అధికారులు నాగభూషణం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డైనమిక్ సంస్థ సేవలు అభినందనీయం

వరదయ్యపాళెం, మార్చి 3: డైనమిక్ ఫౌండేషన్ సేవలు అభినంద నీయమని సప్తగిరి గ్రామీణ బ్యాంకు విశ్రాంత మేనేజరు బొప్పన మోహన మురళి అన్నారు. శంకర్ నేత్రాలయ సహకారంతో డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గోవర్ధనపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు పలువురికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నేత్రాలయ నిపుణులు వెంకటముని, తేజోవాతి, సంస్థ సభ్యులు నాగప్రసాద్, బాలకృష్ణ, మహమ్మద్, మోహన్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీ ప్రశాంతంగా సాగాలి

ఏర్పేడు, మార్చి 3: మనిషి చివరి మజిలీ ప్రశాంతంగా సాగాలని శ్మశానవాటికల్లో బోర్లు బాగుచేయించి, శుభ్రం చేయిస్తున్నట్లు సర్పంచుల సంఘం అధ్యక్షులు నల్లపాళెం శివయ్య తెలిపారు. రెండు రోజుల కిందట గాండ్లవీధికి చెందిన శ్మశానవాటికను శుభ్రం చేయించిన శివయ్య ఆదివారం ఏర్పేడు అశోక్‌నగర్, శ్రీనివాస్‌నగర్, వ్యాసాశ్రమం సమీపం లోని శ్మశాన వాటికలను శుభ్రం చేయించారు. చేతిపంపులను బాగు చేయించారు.

ఘనంగా క్రీడా వార్షికోత్సవం



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, మార్చి 3: పట్టణంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల క్రీడా వార్షికోత్సవం ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరి గింది. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్, మేనేజర్ దైవజ్ఞ క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులు వివిధ రకాల విన్యా సాలతో అలరించారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ పాల్గొన్నారు.

మేర్లపాక వద్ద గుర్తుతెలియని మృతదేహం



ఏర్పేడు, మార్చి 3: మేర్లపాక వద్ద ఆరులేన్ల రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు ఏఎ్‌ఎఐ జగన్‌మోహన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటుంది. ఎర్రటి డ్రాయర్, బనియన్ మాత్రమే ఉంది. గుండు కొట్టుకుని ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు ఏర్పేడు సీఐని సంప్రదించాలి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు పోసి బుల్లెట్ కాల్చివేత



ఏర్పేడు, మార్చి 3: ఏర్పేడులోని గాండ్లవీధికి చెందిన బీజేపీ మండలాధ్యక్షుడు గాండ్ల శివకుమార్ సోదరుడు గాండ్ల శీను బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచాడు. గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ వాహనం విలువ రూ.2.20లక్షలు దీనిపై ఏర్పేడు పోలీసులకు శ్రీను ఆదివారం ఫిర్యాదుచేశాడు.

ఆత్మరక్షణ కోసమే మార్షల్ ఆర్ట్స్



వరదయ్యపాళెం, మార్చి3: వరదయ్యపాళెంలోని విజ్ఞానజ్యోతి స్కూల్‌లో ఆఆదివారం చిత్తూరు జిల్లా టెక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రైనింగ్‌క్యాంపు నిర్వహించారు. సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. పలువురదు మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసమే మార్షన్ ఆర్ట్స్ అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ధనంజయులు, వాసుదేవాచారి, కోదండం, శ్రీనివాసులు, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కన్నప్ప గ్రామోత్సవం



భక్తకన్నప్ప ఉత్సవ మూర్తి ఊరేగింపు

శ్రీకాళహస్తి, మార్చి 3: భక్తకన్నప్ప గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ధ్వజారోహణం అనంతరం భక్తకన్నప్ప ఉత్సవమూర్తి ముక్కంటి ఆలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి జలవినాయక ఆలయం సమీపంలో బోయ కులస్థులు ఉభయదారులుగా ఏర్పాటు చేసిన విడిది మండపంలోకి చేరారు. బోయ కులస్థులు స్వామివారి ఉత్సవమూర్తికి వస్త్రాలు, ధూప, దీప నైవేద్యాలను ఉదయదారులుగా సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. సన్నిధివీధి నుంచి రాజ గోపురం వరకు, అటు నుంచి చుతుర్మాడ వీధుల్లో కన్నప్ప గ్రామోత్సవం సాగింది. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో తొలి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కాగా మామూలుగా భక్త కన్నప్ప ఆత్సవ మూర్తి ఊరేగింపులో శివ పరివారంతో కలిసి ఊరేగుతారు. అన్నీ సమయాల్లోనూ కన్నప్ప పరమశివుని నిత్యం దర్శిస్తూ వెనుకవైపుకు నడుస్తున్నట్టుగా సాగుతారు. అయితే ఏడాదిలో ఈ ఒక్క రోజు మాత్రం ముందుకు వైపుగా దర్శనమిస్తూ ఊరేగడం విశేషం.



సుందరంగా ఉన్న స్వర్ణముఖి కరకట్ట

ఆకర్షణీయం ఓంకార పతాకం

పట్టణంలో నవభారత్ యువజన సంఘం స్వచ్ఛంద సంస్థ నిర్వాహ కులు ఏర్పాటుచేసిన ఓంకారం పతా కాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోకి ప్రవేశించే రామసేతు, కన్నప వంతెనలపై, అలాగే సుపథ మండపం వద్ద పెద్ద ఎత్తున ఏర్పాటుచేసిన ఓంకార జెండాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.



ఆకట్టుకుంటున్న శివపార్వతుల విద్యుత్ దీపాలంకరణ కటౌట్



ధ్వజస్తంభం వద్ద పూల అలంకరణలు



సుపథ మండపం

'సూపర్ సిక్స్'తో మంచి భవిష్యత్తు



అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 3: టీడీపీ అధినేత చంద్ర బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, బీసీ విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. ఆదివారం 18 వార్డు పరిధిలో ఓటర్లకు సూపర్ సిక్స్‌తో పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 52వ బూత్ పరిధిలోని ఓటర్లకు కరపత్రాలు పంచిపెట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు ఆశీర్వదం కావాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె, కార్యనిర్వాహక కార్యదర్శి బుజ్జి, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు షేక్ రియాజ్, షేక్ మహబూబ్ బాషా, మొఘల్ షబీనా, షేక్ ఫైరోజ్, తెలుగు మహిళా నాయకులు శాంతాబాయి, గౌరీబాయి తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందించాలి : హెలెన్



సమావేశంలో మాట్లాడుతున్న హెలెన్

సత్యవేడు, మార్చి 3: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతమొందించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో హెలెన్ అధ్యక్షతన పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హేమలత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హెలెన్ మాట్లాడుతూ రాబోయే 40 రోజులు రాష్ట్ర భవిష్యత్‌కు అత్యంత కీలకమన్నారు. అరాచకాన్ని గద్దెదింపి, అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. సీఎం జగన్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. నాయకులు మునస్వామి యాదవ్, గిరి, కన్నయ్య నాయుడు, సుధాకర్‌నాయుడు, పరంధామయ్య నాయుడు, సంతోష్ కుమార్, వరలక్ష్మి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడులు..ఐదుగురి అరెస్ట్

రేణిగుంట, మార్చి3: మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీ సమీపంలోవున్న మామిడి తోటల్లో ఆదివారం కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. సమీప గ్రామాలకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. నాలుగు కోళ్లు, రూ.5620 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లికార్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్మశాన ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ

రేణిగుంట, మార్చి 3 : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఆదివారం ఆయన రేణిగుంట మండలంలో కరకంబాడి పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేశారు. కరకంబాడి, ఇందిరానగర్, దొడ్లమిట్ట, కరకంబాడి హరిజనవాడ, రాజీవ్‌గాంధీ కాలనీల శ్మశాన వాటికల ప్రహరీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే అమరరాజా సంస్థ నుంచి తారకరామా నగర్ వరకు సిమెంటు రోడ్డు , చింతకోన కాలనీకి సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైసీపీ మండల అధ్యక్షుడు రమేష్, సర్పంచ్ ఈశ్వరమ్మ, నాయకులు మునిరెడ్డి, క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీలు కన్నయ్యలు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టండి : సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, మార్చి 3: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాపానాయుడుపేటలో ఆదివారం ఆయన మీ ఇంటికి మీ బొజ్జల కార్యక్రమం ద్వారా ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, బాలాజీనాయుడు, నాగరాజునాయుడు, రోశయ్య, రవికుమార్, కృష్ణప్ప మొదలియార్, గిరినాయుడు, చిరంజీవులు నాయు డు, శివశంకర్‌రెడ్డి, మనోహర్‌నాయుడు, రమేష్‌నాయుడు, హేమాక్షి, సీతాపతి ఆచారి,మునిరెడ్డి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో ఇళ్లకు ఉచిత విద్యుత్

వరదయ్యపాళెం, మార్చి 3: గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందించడానికి ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సీఎస్‌సీ జిల్లా మేనేజరు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఫిబ్రవరి 15న ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారన్నారు. ఆ పథకం ఉపయోగాలను సతీష్ వివరించారు. మరన్ని పూర్తి వివరాల కోసం సీఎస్‌సీ కేంద్రంలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలియజేశారు.

కామధేను వాహనంపై గరళ కంఠుడి చిద్విలాసం



కామధేను వాహనంపై స్వామి, అమ్మవార్లు

నాగలాపురం, మార్చి 3: నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లి కొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఆదివారం గరుళ కంఠుడు కామధేను వాహనంపై పురవీధుల్లో చిద్విలాసంతో విహరించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు చేపట్టారు. అనంతరం యాగశాల మండపంలో యాగశాల పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని మూలస్థాన దేవతలు వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం వివిధ రకాల పుష్పాలతో, బంగారు ఆభరణాలతో, పట్టు వస్త్రాలతో సుందరంగా ముస్తాబు చేసి మహా హారతి చేపట్టారు. హారతి అనంతరం స్వామి, అమ్మవార్లను కామధేను వాహనంపై అధిష్ఠింప చేసి మంగళవాయిద్యాలు, బాణ సంచా పేలుళ్ల నడుమ తిరు వీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవంలో వచ్చిన స్వామి, అమ్మవార్లకు స్థానిక భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు పట్టి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజలకు చెన్నైకి చెందిన నరసింహులు రేవతి కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజలను ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తి నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం 4:30 గంటలకు మంగళ వాయిద్యాలు
- ఉదయం 5గంటలకు గోపూజ, సుప్రభాతం, సర్వదర్శనం
- ఉదయం 6 గంటలకు ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7గంటలకు ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8 గంటలకు పరివార దేవాలయాల నైవేద్యం, అనంతరం స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 10:30 గంటలకు ఉచ్చికాల అభిషేకం
- మధ్యాహ్నం 12:05 గంటలకు కొడిదారం ఊరేగింపు, ధ్వజానికి దర్భతాడు కట్టడం
- మధ్యాహ్నం 1 గంటకు స్వామివారి ధ్వజారోహణ సంకల్పం ఆరంభం
- మధ్యాహ్నం 2:30 గంటలకు స్వామివారి ధ్వజారోహణం
- మధ్యాహ్నం 4 గంటలకు నైవేద్య, దీపారాధనలు
- సాయంత్రం 5:30 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యాగశాల పూజ
- రాత్రి 8 గంటలకు స్వామి అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- రాత్రి 9:30 గంటలకు దర్శనం ముగింపు

సహజ శిలా గణపయ్యకు పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 3: భక్త కన్నప్ప కొండ మెట్ల మార్గంలోని సహజ శిలా గణపయ్యకు ఆదివారం భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్త కన్నప్ప ధ్వజారోహణం జరిగింది. ఇందులో భాగంగా భక్తకన్నప్ప ఉత్సవమూర్తి కొండపైకి వేంచేశారు. ఈ సమయంలో వెంట వెళ్లిన భక్తులు మెట్లు మార్గంలో సహజ చిలకా దర్శనమిచ్చే గణపయ్య ప్రతిమకు పసుపు అద్ది కుంకుమతో బొట్లు బొట్లు పెట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.